# అనుభూతి!

రచన:
శ్రీ బి.వి.డి. ప్రసాదరావు

గుండె లదురుతున్నాయి.

బస్సు పోలీసుస్టేషను ముందాగింది.

బస్సు సిబ్బంది, తలుపులువద్ద నించున్నారు. బస్సులోవారిని బయటికి రానివ్వకుంటున్నారు

బస్సు కండక్టర్, ఆ సూట్‌వాలా పోలీస్ స్టేషన్‌లోకి నడిచారు. రెండు నిమిషాల్లో మళ్ళీ వచ్చారు బయటికి, పోలీస్ సిబ్బందితో.

కొంతమంది పోలీస్‌లు బస్సులోకి ప్రవేశించారు. ఒక్కొక్కర్ని బయటికి వదులుతున్నారు. వాళ్ళ జేబులను మరి కొంతమంది పోలీస్‌లు తనిఖీ చేస్తున్నారు.

నేను బస్సులో వెనుక సీట్లో వున్నాను. నాకు భయంగా వుంది. ఏడుపు వస్తోంది. ఎలాగో తప్పించుకుపోతే బావుంటుంది. జేబుపై చెయ్యి వేశాను. పర్సు తగిలింది. చివుక్కుమంది మనసు.

20 నిమిషాల క్రితం, బస్సులో ఓ సూట్‌వాలా సడన్‌గా గోలచేశాడు—తన పర్సు పోయిందని. దాంతో బస్సులో రభస మొదలైంది. నా గుండె లదిరాయి. చిందరవందరగా ఆ సూట్‌వాలా అటు యిటు తిరుగుతున్నాడు, జేబులు తనిఖీ చేస్తానన్నాడు. అందుకు చాలా మంది వ్యతిరేకించారు. కనుక బస్సు పోలీసుస్టేషనువద్ద ఆగినట్టు చేశాడా సూట్‌వాలా—చాలాసేపు బస్సు సిబ్బందితో ఘర్షణపడి.

నిజానికి ఆ పర్సు నా వద్దవుంది. అలాగని నేనతని జేబు కత్తిరించలేదు. నేను జేబుదొంగను కాను. ఓ నిరుద్యోగిని. టిక్కెట్టు తీసుకొని, సీట్లో సర్దుకు కూచుండేసరికి నా కాలికి ఏదో తగిలినట్టు అయింది. జాగ్రత్తగా దాన్ని ఎడమ కాలితో పట్టి, కుడిచేతిలోకి తీసుకొని, బేక్ జేబులో కుక్కుకున్నాను. ఇవన్నీ గబగబా జరిగిపోయాయి. స్పర్శ మూలంగా అదో పర్సుగా గ్రహించాను. ఎన్నెన్నో కలలు కన్నాను. మరవి కార్యరూపం దాల్చవేమో!

పర్సు పోయిందని ఆ సూట్‌వాలా మొరపెట్టుకున్నప్పుడే ఇచ్చేయాలనుకున్నాను. కానీ అంత స్వచ్ఛంగా ఇస్తే, అతను నేనే దొంగనంటాడేమో? అందరూ నన్ను తూలనాడతారేమో! ఇంకేమో చేస్తే?

'దొరికింది! దొరికింది! హుఁ చూస్తే పెద్ద మనిషిలా వున్నావు. దొంగతనం చెయ్యడానికి మనసు ఎలా వచ్చింది?'

ఆ మాటలు విని, ఆలోచనల్లోంచి బయటపడి, అటు చూశాను.

ఒకతని చుట్టూ అందరూ మూగారు, తలో మాట అంటున్నారు—

అరె! మరి నా దగ్గరున్న పర్సు? జాగ్రతగా దాన్ని బయటికి తీశాను అటు ఇటు చూస్తూ.

పర్సువేపు చూసి, గతుక్కుమన్నాను. కుప్పలా సీట్లో కూలిపోయాను. పర్సు నాదే! మరి క్రిందకు ఎలా వచ్చింది? టిక్కెట్టు తీసుకున్నప్పుడు దాన్ని బయటికి తీశాను. బహుశా జేబులో పెట్టుకుంటున్నప్పుడు, జనం తొక్కులాటలో అది క్రింద పడిందేమో!

మై గాడ్! థాంక్స్!

నా పర్సు నాకే దొరికింది—కానీ, అదే ఇంకొకరి చూపులకు చిక్కివుంటే?